# బిజినెస్

## తగ్గిన బంగారం ధరలు

### -వెండి ధరలోనూ స్వల్ప తగ్గుదల



హైదరాబాద్,
బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు బుధవారం స్వల్పంగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, కొనుగోళ్లలో వచ్చిన మార్పుల ప్రభావంతో పసిడి ధరల్లో కొంత తగ్గుదల నమోదైంది. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి స్వల్ప ఊరట లభించింది. 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.950 తగ్గి రూ.1,41,450కు చేరింది. అదే సమయంలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములకు రూ.1,040 తగ్గి రూ.1,54,310గా నమోదైంది. వరుసగా మారుతున్న మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో పసిడి ధరల్లో రోజువారీగా స్వల్ప హెచ్చుతగ్గులు చోటుచేసుకుంటున్నాయి. ఇక వెండి ధర కూడా కొంత తగ్గింది. కిలో వెండిపై రూ.100 తగ్గడంతో రూ.2,54,900 వద్ద కొనసాగుతోంది. బంగారం ధరతో పోలిస్తే వెండి ధరలో తగ్గుదల స్వల్పంగానే ఉన్నప్పటికీ, మార్కెట్‌లో ధరల మార్పు నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోనూ బులియన్ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఇదే ధరలు కొనసాగనున్నాయి. అయితే ఆభరణాల కొనుగోలు సమయంలో బంగారం ధరకు అదనంగా మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీ, ఇతర పన్నులు వర్తించే అవకాశం ఉంటుంది. అందువల్ల ఆభరణాల తుది ధర బులియన్ మార్కెట్‌లో ప్రకటించిన ధర కంటే కొంత ఎక్కువగా ఉండవచ్చు. పసిడి ధరలు అంతర్జాతీయ మార్కెట్ కదలికలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ, దేశీయ డిమాండ్, పెట్టుబడిదారుల ఆసక్తి వంటి పలు అంశాలపై ఆధారపడి రోజువారీగా మారుతుంటాయి. దీంతో రానున్న రోజుల్లో ధరలు ఏ దిశగా కదులుతాయన్నది మార్కెట్ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

## ఫుడ్ డెలివరీ రంగంలోకి ఫ్లిప్‌కార్ట్!

### 'ఈట్ ఇన్' పేరుతో కొత్త సేవలు.. జొమాటో, స్విగ్గీలకు పోటీ




బెంగళూరు: ప్రముఖ ఆన్‌లైన్ వాణిజ్య సంస్థ ఫ్లిప్‌కార్ట్ ఆహార పంపిణీ రంగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. వాల్‌మార్ట్ మద్దతుతో 'ఈట్ ఇన్' పేరుతో కొత్త సేవలను ప్రారంభించనుంది. ప్రస్తుతం బెంగళూరులో ఈ సేవలపై అంతర్గతంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆహార పంపిణీ రంగంలో ప్రముఖ సంస్థలుగా ఉన్న జొమాటో, స్విగ్గీలకు పోటీగా ఫ్లిప్‌కార్ట్ ఈ సేవలను తీసుకురానుంది. తక్కువ కమీషన్లు, మెరుగైన సేవలు, వినియోగదారులకు అందుబాటులో ఉండే ధరలతో మార్కెట్‌లో తనదైన గుర్తింపు తెచ్చుకోవాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

**ఓఎన్‌డీసీ ద్వారా సేవలు**

ఫ్లిప్‌కార్ట్ 'ఈట్ ఇన్' సేవలను ఓఎన్‌డీసీ నెట్‌వర్క్ ద్వారా అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. తక్కువ కమీషన్ల కారణంగా రెస్టారెంట్లను ఎక్కువగా ఆకర్షించడంతో పాటు, ఆ ప్రయోజనాన్ని వినియోగదారులకు కూడా అందించాలని సంస్థ యోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం బెంగళూరులో జరుగుతున్న పరీక్షల్లో ఆహార ఆర్డర్ల స్వీకరణ, రెస్టారెంట్లతో అనుసంధానం, పంపిణీ వ్యవస్థ, వినియోగదారుల అనుభవం వంటి అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పరీక్షలు విజయవంతంగా పూర్తయిన అనంతరం ఈ సేవలను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఫ్లిప్‌కార్ట్ ప్రవేశంతో దేశీయ ఆహార పంపిణీ రంగంలో పోటీ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా తక్కువ కమీషన్లు, ఆకర్షణీయమైన ధరలు, మెరుగైన సేవల ద్వారా వినియోగదారులను తమవైపు తిప్పుకోవాలని సంస్థ ప్రయత్నిస్తోంది.

## భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు

### చమురు ధరలు 100 డాలర్లు దాటడంతో ప్రతికూల ప్రభావం




ముంబై,
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం భారీ నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లు దాటడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. దీనికి తోడు ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు భారీగా పతనమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 813.35 పాయింట్లు నష్టపోయి 74,764.23 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 203.60 పాయింట్లు కోల్పోయి 23,431.50 వద్ద స్థిరపడింది. ముఖ్యంగా హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా వంటి ఐటీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరోవైపు అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. ఇక విదేశీ మారక మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.11గా నమోదైంది. పశ్చిమాసియా పరిణామాలు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు రానున్న రోజుల్లో దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశముంది.

## కెప్టెన్‌కు కనీసం చెప్పకుండానే ఏడుగురిపై వేటు

### పాక్ మేనేజ్‌మెంట్‌పై బాబర్ ఆజమ్ బాంబ్

### తనకు సమాచారమే లేదన్న పాకిస్థాన్ కెప్టెన్

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో వరస ఓటములతో కుదేలైన పాకిస్థాన్ క్రికెట్‌లో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సిరీస్ మధ్యలోనే ఏకంగా ఏడుగురు ఆటగాళ్లను జట్టు నుంచి తొలగించి ఇంటికి పంపడంతో పాటు కోచింగ్ సిబ్బందిలోనూ మార్పులు చేసింది. ఎడ్జ్‌బాస్టన్‌లో జరగబోయే ఆఖరి టెస్టుకు ముందు విలేకరుల సమావేశంలో మాట్లాడిన కెప్టెన్ బాబర్ ఆజమ్ , ఈ నిర్ణయం తనను కూడా ఆశ్చర్యానికి గురిచేసిందని చెప్పాడు. బోర్డు తీసుకున్న నిర్ణయం గురించి తనకు ముందస్తు సమాచారం లేదని బాబర్ సంచలన విషయాలు బయటపెట్టాడు.

కెప్టెన్‌ను సంప్రదించకుండానే వేటు

జట్టును పునర్వ్యవస్థీకరించే క్రమంలో పీసీబీ తీసుకున్న చర్యలపై బాబర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. "ఈ నిర్ణయం నాకు కూడా సర్‌ప్రైజ్‌లానే అనిపించింది. పీసీబీ ప్రకటన చేసిన తర్వాతే నాకు కూడా విషయం తెలిసింది. నన్ను ఈ విషయంలో ఎవరూ సంప్రదించలేదు. బోర్డే ఈ నిర్ణయం తీసుకుంది కాబట్టి, ఎందుకు ఇలా చేయాల్సి వచ్చిందో వారే బాగా వివరించగలరు" అని బాబర్ పేర్కొన్నాడు. కాగా, సీనియర్ వికెట్ కీపర్ మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్-ఉల్-హక్, సల్మాన్ అలీ అఘా, ఆమిర్ జమాల్, ఖుర్రమ్ షెహజాద్, అలీ ఉస్మాన్, అవైస్ జఫార్‌లను పీసీబీ జట్టు నుంచి తొలగించిన సంగతి తెలిసిందే.




మరోవైపు ఈ తీవ్ర ఉత్కంఠ పరిణామాలు జరుగుతున్న సమయంలో బాబర్ ఆజమ్ అనారోగ్యం పాలయ్యాడు. గత కొన్ని రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న అతడు ప్రాక్టీస్ సెషన్లకు దూరమయ్యాడు. అయితే ఎడ్జ్‌బాస్టన్ టెస్టుకు ముందే తాను పూర్తి ఫిట్‌నెస్ సాధించానని బాబర్ ధృవీకరించాడు. "నేను ఇప్పుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నాను. ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో జట్టుకు సారథ్యం వహించడానికి సిద్ధంగా ఉన్నా" అని స్పష్టం చేశాడు. ఇంగ్లాండ్ చేతిలో ఇప్పటికే వరుసగా రెండు టెస్టుల్లో దారుణ పరాజయం పాలైన పాకిస్థాన్, ఆఖరి టెస్టులో ఎలాగైనా గెలిచి క్లీన్ స్వీప్ నుంచి తప్పించుకోవాలని పట్టుదలతో ఉంది. బోర్డు తీసుకున్న ఆకస్మిక నిర్ణయాలు, కొత్తగా మారిన స్క్వాడ్, కోచింగ్ మేనేజ్‌మెంట్‌లో అనిశ్చితి నడుమ మూడో టెస్టులో విజయం సాధించడం బాబర్ సేనకు అతిపెద్ద సవాలుగా మారింది. బుధవారం మూడో టెస్టు ప్రారంభం కానుంది.

# స్పోర్ట్స్

## తిలక్ వర్మ 99 ఔట్..

## ఈస్ట్ జోన్‌కు భారీ ఆధిక్యం



చెన్నై:
దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో దక్షిణ మండలిపై తూర్పు మండలం భారీ ఆధిక్యం సాధించింది. నాలుగో రోజు ఆటలో దక్షిణ మండలం తొలి ఇన్నింగ్స్‌లో 336 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టు కెప్టెన్ తిలక్ వర్మ తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. 99 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటై నిరాశకు గురయ్యాడు. తిలక్ వర్మ ఒంటరి పోరాటం చేసినప్పటికీ, మిగతా బ్యాటర్లు ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. దీంతో దక్షిణ మండలం చివరి నాలుగు వికెట్లను కేవలం 18 పరుగుల వ్యవధిలోనే కోల్పోయింది. ఫలితంగా తూర్పు మండలానికి తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 372 పరుగుల ఆధిక్యం లభించింది. అంతకుముందు తూర్పు మండలం తన తొలి ఇన్నింగ్స్‌లో భారీగా 708 పరుగులు చేసింది. దక్షిణ మండలం బ్యాటర్లలో తిలక్ వర్మ 99 పరుగులతో అత్యధిక స్కోరు సాధించాడు. అయితే ఒక్క పరుగు తేడాతో శతకాన్ని కోల్పోయాడు. తూర్పు మండలం బౌలర్లలో ముకేశ్ కుమార్ మూడు వికెట్లు పడగొట్టగా, షమీ, ఖురేషి, మోహన్ చెరో రెండు వికెట్లు తీశారు. మిగతా వికెట్లు ఇతర బౌలర్లకు దక్కాయి. ప్రస్తుతం భోజన విరామం కావడంతో తదుపరి దశలో దక్షిణ మండలం అనుసరణకు దిగుతుందా? లేక తూర్పు మండలం మరోసారి బ్యాటింగ్‌కు వస్తుందా? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. 372 పరుగుల భారీ ఆధిక్యంతో తూర్పు మండలం మ్యాచ్‌పై పట్టు బిగించింది.

## భారత్, ఆఫ్ఘనిస్తాన్ సిరీస్‌కు వైభవ్

భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్లు సెప్టెంబర్ 13వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనున్నాయి. శ్రేయస్ అయ్యర్ భారత జట్టుకు సారథ్యం వహించనుండగా.. తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సిరీస్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాడు. ఈ సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరగనున్నాయి. టీమిండియాలో పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. సంజూ శాంసన్, జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రాగా.. జింబాబ్వే పర్యటనలో ఉన్న రింకూ సింగ్‌ను ఈ మ్యాచ్‌ల నుంచి తొలగించారు. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ పూర్తి ఫిట్‌నెస్ సాధించగా.. జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డిల సెలెక్షన్ వారి ఫిట్‌నెస్ ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టుకు ఇబ్రహీం జద్రాన్ నాయకత్వం వహిస్తున్నారు. ఇండియాలో ఈ టీ20 సిరీస్ సోనీ స్పోర్ట్స్ నెట్వర్క్ లో ప్రత్యక్షప్రసారం కానుంది. అలాగే డిజిటల్




ప్లాట్‌ఫామ్‌లలో చూడాలనుకునే అభిమానులు ఫ్యాన్‌కోడ్ యాప్, వెబ్‌సైట్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్ ను వీక్షించవచ్చు. ఈ మూడు మ్యాచ్‌లు సాయంత్రం 7:00 గంటలకు ప్రారంభమవుతాయి. భారత క్రికెట్ అభిమానులు ఈ సిరీస్‌లో ఉత్కంఠభరితమైన పోటీలను ఆశించవచ్చు. వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు .

టీమిండియా జట్టు : శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డిలి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా .

ఆఫ్ఘనిస్థాన్ జట్టు: ఇబ్రహీం జద్రాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), నూర్ రెహ్మాన్ (వికెట్ కీపర్), సెడిఖుల్లా అటల్, దర్విష్ రసూలీ, అజ్మతుల్లా ఉమర్‌జాయ్, గుల్బాదిన్ నాయబ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, నంగియలై ఖరోటి, నూర్ అహ్మద్, ముజీబుర్ రెహ్మాన్, ఫజల్ హక్ ఫరూకీ, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, నవీన్-ఉల్-హక్

భారత్- ఆఫ్ఘనిస్తాన్ టీ20 సిరీస్ పూర్తి షెడ్యూల్
మొదటి టీ20 - సెప్టెంబర్ 13, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ) రెండో టీ20 - సెప్టెంబర్ 15, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ) మూడో టీ20ఐ - సెప్టెంబర్ 17, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ)

